**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 10.05.2026** **సమయం:13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు హైదరాబాద్ లో సుమారు 9వేల 377 కోట్ల రూపాయల విలువైన వివిధ ప్రాజెక్టులకు మరి కొద్దిసేపటిలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేయనున్నారు.
2. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.
3. రాష్ట్రంలోని రైతులను పంటల మార్పిడికి ప్రోత్సహించాలని, ఈమేరకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.
4. రాష్ట్రంలోని రద్దీ ఉండే రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పని చేసే కాలాన్ని పెంచుతున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

.....................................................................

**ప్రధానమంత్రి**

ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్రమోదీ ఈరోజు రాష్ట్ర పర్యటనకు వస్తున్నారు. మధ్యాహ్నం 9వేల 377 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి, ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేసే కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో బీజేపీ నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సుమారు మూడు గంటలకుపైగా నగరంలో పర్యటించనున్న మోదీ

వరుసగా అనేక కార్యక్రమాల్లో పాల్గొనేలా షెడ్యూలు ఖరారైంది. తొలుత ప్రధాని బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో ఈ మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హెచ్ఐసీసీకి వెళతారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పలువురు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి 9వేల 377 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు చేస్తారు.

......డెస్క్

**రేవంత్ రివ్యూ**

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆధునీకరణ, నగరీకరణతో సమీప భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంటుందని పేర్కొన్నారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిన్న సచివాలయంలో జరిగింది. స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పలువురు ఎంపీలు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని, కీలకమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఉపరితల రహదారులు, ఎలివేటెడ్ కారిడార్‌ల వంటి మూడు విధానాల్లో ట్రాఫిక్‌కు సులభతరమైన రవాణా మార్గాలను కల్పించే విధానాన్ని ఎంచుకున్నామని చెప్పారు. మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

......డెస్క్

**తుమ్మల**

రాష్ట్రంలోని రైతులను పంటల మార్పిడికి ప్రోత్సహించాలని, వచ్చే మూడేళ్లలో 13 లక్షల ఎకరాలను ఉద్యాన పంటలు, పప్పు, చిరుధాన్యాలు, నూనె గింజల పంటల సాగుకు

మళ్లించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉండే పంటలు సూచిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో దేశీయ అవసరాలు తీరతాయన్నారు. సచివాలయంలో నిన్న పంటల మార్పిడిపై రూపొందించిన నివేదికను రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి మంత్రికి అందజేశారు.

........డెస్క్

**పొంగులేటి**

రాష్ట్రంలో భూముల ధరల సవరణ చేపట్టనున్న నేపథ్యంలో ప్రజల నుంచి పెద్దఎత్తున రిజిస్ట్రేషన్లు పెరిగే అవకాశం ఉన్నందున రద్దీ ఉండే కార్యాలయాల్లో పని గంటల వ్యవధిని పెంచుతున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 12 నుంచి అదనంగా మరో రెండు గంటలపాటు సేవలు అందుబాటులో ఉంటాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

.......డెస్క్

**సీతక్క**

మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై నిన్న మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3వేల 563 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 11 లక్షల టన్నుల ధాన్యం కేంద్రాలకు చేరుకుందని చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఎక్కువసేపు వేచి ఉండకుండా కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని సీతక్క సూచించారు.

.....డెస్క్

**ఇంటర్ – సప్లీమెంటరీ**

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ డ్ సప్లీమెంటరీ పరీక్షలు ఈనెల 13 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని ఇంటర్మీడియేట్ బోర్డ్ కార్యదర్శి అభిలాష్ అభినవ్ ఒక ప్రకటనలో

తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు జరుగుతాయని వివరించారు. ఈనెల 22, 25 తేదీల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని ఆయన తెలిపారు.

.......డెస్క్

**మెగా జాబ్ మేళా**

యాదాద్రి భువనగిరి జిల్లా  కుంభం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా ఈ రోజు ఘనంగా జరిగింది. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత నైపుణ్యాలను పెంపొందించుకొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

.......పిటిసి, యాదాద్రి

**కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్  - పీఎం మిత్ర**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట హవేలీ లోని కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమకు సంబంధించి పీఎం మిత్ర పథకాన్ని వర్చువల్ పద్ధతిలో ప్రారంభిస్తారు. ఈ క్రమంలో వస్త్ర పరిశ్రమ లోని కంపెనీలను కేంద్ర ప్రభుత్వ వస్త్ర పరిశ్రమ మంత్రిత్వ శాఖ అధికారులు నిన్న సాయంత్రం సందర్శించి కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులోని పరిశ్రమలు, ఉత్పత్తుల వివరాలను తెలుసుకున్నారు.

.......వరంగల్ జిల్లా పిటిసి

**బీజేపీ సభ**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో ఈ సాయంత్రం జరగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభ కోసం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆపార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉదయం నుంచి

ప్రైవేటు వాహనాలతో పాటు, ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసి కార్యకర్తలను తరలిస్తున్నారు.. రైలు మార్గం ద్వారా కూడా వందలాది మంది కార్యకర్తలు తరలి వెళ్లారు..

......పిటిసి, నల్గొండ

**ప్రధాని మోదీ సభ**

సికింద్రాబాద్ పెరేడ్ మైదానంలో జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభకు బిజెపి రాష్ట్ర పార్టీ ప్రత్యేక రైలు సౌకర్యాన్ని కల్పించింది. ఈ రైలు మధ్యాహ్నం 12 గంటల పదినిమిషాలకు వరంగల్ రైల్వే స్టేషన్ నుండి అభిమానులను కార్యకర్తలను తరలించి తిరిగి రాత్రి మల్కాజ్గిరి నుంచి 10 గంటల 15 నిమిషాలకు బయలుదేరుతుంది.

....పిటిసి, వరంగల్

**ప్రధాని సభకు తరలిన శ్రేణులు**

హైదరాబాద్ లో ఈరోజు నిర్వహించే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. సిర్పూర్ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే హరీష్ బాబు ఆధ్వర్యంలో 2000 మందిని తరలించేందుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయగా ప్రతి మండల కేంద్రాల నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

.....పిటిసి, ఆసిఫాబాద్

**వడ్లగింజ కొనుగోలు**

రైతులు పండించిన ప్రతీ వడ్లగింజ కొనుగోలు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్య మని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**సౌండ్ బైట్... మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు...**

.......పిటిసి, మంచిర్యాల

**జాగ్రత్తలు**

ఈ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా పెరుగుతున్నందున, అధిక వేడి వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందని, కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రజిత చెప్పారు. ఆకాశవాణితో ఆమె మాట్లాడుతూ.......

**బైట్ – రజిత**

......పిటిసి, సిరిసిల్ల

**హనుమాన్ జయంతి**

జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న అంజన్న జయంతి ఉత్సవాలకు ఆలయ ప్రాంతం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాష్ట్రం నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు ఉత్సవాలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో దేవస్థానం అధికారులు, జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టారు

......పిటిసి, జగిత్యాల

**అంగన్వాడీ**

ఐదు సంవత్సరాల లోపు వయసు ఉన్న పిల్లల ఎదుగుదల లోపిస్తే సమీప అంగన్వాడి కేంద్రాల వారికి సమాచారం ఇవ్వాలని,, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సి డి పివో సౌందర్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాంటి పిల్లలను అంగన్వాడీ కేంద్రాల వారి సమాచారంతో వైద్యులు వివిధ పరీక్షలు చేసి లోపాన్ని గుర్తిస్తారని తెలిపారు.

.....పిటిసి, సిరిసిల్ల

**ధాన్యం కొనుగోలు**

అధికారులు, మిల్లర్ల సహకారంతో ప్రస్తుత రబీ సీజన్ లో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1లక్షా 85వేల మెట్రిక్ టన్నుల ధాన్యంను రైతుల నుండి సేకరించామని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. .....పిటిసి, సూర్యాపేట